క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరాలు

చేవెళ్ల: చేవెళ్ల మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో శంకర్‌కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఫినిక్స్ పౌండేషన్‌ల సంయుక్త సహకారంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు.

దామరగిద్దలో..

మండలంలోని దామరగిద్ద గ్రామంలో రెడ్డిశెట్టి ప్రకాశ్‌గుప్తా ఆధ్వర్యంలో శ్రీసాయి సేవా సమితి వనస్థలిపురం వారి సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ మధుసూదన్‌గుప్తా తెలిపారు. ఉదయం 9గంటల నుంచి ఈ శిబిరం నిర్వహిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు వచ్చిన ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఉదయం మంత్రికి పుష్పగుచ్ఛం అంజేసి విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకొని వచ్చినందుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉన్నత లక్ష్యాలతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

చేవెళ్ల: విద్యార్థులకు ఉన్నత లక్ష్యం ఉంటేనే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని చేవెళ్ల ఏసీపీ పి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కేజీఆర్ గార్డెన్‌లో శనివారం శ్రీచైతన్య జూనియర్, డిగ్రీకళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమని, కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్, డైరెక్టర్లు రఘుపతిరెడ్డి, మనోహర్ రెడ్డి, కరస్పాండెంట్ శ్రీకాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత



శ్రీకృష్ణస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ దంపతులు

షాబాద్: దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని దేవాలయ చైర్మన్ తాళ్ల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడ శ్రీ కృష్ణ స్వామి దేవాలయంలో యజ్ఞం, హోమం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు తమ ఇష్ట దైవాన్ని కొలవాలని సూచించారు. ప్రతీ ఒక్కరు కొంత సమయం దైవ ప్రార్థనకు కేటాయించాలని చెప్పారు.

బీజేపీ నిరసన

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండా నుంచి శంకరకొండతండా రోడ్డులో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదని ఆమనగల్లు పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మేడిగడ్డతండా ప్రజలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కండెసాయి, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కడ్తాల: మక్తమాదారం గ్రామంలో కంఠమహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి, గౌడ సంఘం నాయకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో భక్తిభావం పెంపొందుతుందన్నారు. సర్పంచ్ సులోచన, ఎంపీటీసీ మంజుల, మార్కెట్ డైరెక్టర్ నర్సింహగౌడ్, నరేశ్‌గౌడ్, చెన్నయ్య పాల్గొన్నారు.

వైజంక్షన్.. అయోమయం

- ఐదేళ్లుగా 'సా'గుతున్న అండర్‌పాస్ పనులు
- డిజైనింగ్‌లో లోపాలు
- ఉదాసీనతతో రూ. 15 కోట్లు నష్టం
- అర్ధంతరంగా పనులు నిలిపేత
- పట్టించుకోని అధికారులు



వైజంక్షన్ కూడలి

కొత్తూరు: ప్రస్తుత సాంకేతికతను అంది పుచ్చుకొని ట్రాఫిక్, రద్దీ ప్రాంతాల్లోని కూడళ్లలో ఇంజనీర్లు ఎంతో ఉపయోగకరంగా వంతెనలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే శంషాబాద్ సమీపంలోని ఓఆర్ఆర్‌తో పాటు పలుచోట్ల నిర్మించిన వంతెనలు వారి ప్రతిభకు తార్కాణం. కొత్తూరు పట్టణ శివారులో వైజంక్షన్ కూడలీ సమీపంలో నిర్మిస్తున్న అండర్‌పాస్ వంతెన డిజైన్ మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఏ ఉద్దేశంతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఈ డిజైన్‌ను ఆమోదించి పనులు ప్రారంభించారో అని, ఎలా పూర్తి చేయాలనే ఆలోచలో వారు అయోమయంలో ఉన్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మొత్తంగా వీరి అలసత్వం కారణంగా ప్రభుత్వానికి రూ.15 కోట్లు నష్టం వాటిల్లింది. దానికి తోడు కూడలీ వద్ద జరిగిన ప్రమాదాల్లో ఇప్పటి వరకు పదుల సంఖ్యలో వాహనదారులు ప్రాణాలు కోల్పోయారు.

డిజైనింగ్‌లో లోపాలు..

కొత్తూరు పట్టణం సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న వైజంక్షన్ కూడలీలో నిర్మిస్తున్న అండర్‌పాస్ వంతెన డిజైనింగ్‌లోనే లోపాలు ఉన్నట్లు స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. కూడలీలో వంతెన నిర్మిస్తే అంతకుముందు ఉన్న సమస్యలు, ప్రమాదాలు తగ్గక పోగా కొత్త సమస్యలు తలెత్తుతున్నట్లు వారు వాపోతున్నారు. అండర్‌పాస్ నిర్మాణం వల్ల సమీపంలోని శివానగర్ కాలనీలోకి వెళ్లే ప్రధాన రోడ్డు మూతపడుతుందన్నారు. పెంజర్ల నుంచి కొత్తూరులోకి, కొత్తూరు నుంచి పెంజర్ల రోడ్డులోకి వెళ్లే వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా చిన్న వర్షాలకే వంతెన కింద 20 ఫీట్లలోతు వరకు నీరు చేరుతుంది.

రూ.15 కోట్లు వృథా..

వైజంక్షన్ బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన అధికారులు ఇక్కడ వంతెన నిర్మించాలని ప్రభుత్వంతో పాటు ఎన్‌హెచ్ఏఐ అధికారులకు నివేదించారు. ఇందులో భాగంగా 2019లో సుమారు రూ.15 కోట్లతో పనులు ప్రారంభించారు. వైజంక్షన్ కూడలీలో ప్రస్తుతం నిర్మిస్తున్న అండర్‌పాస్‌తో ఎలాంటి ప్రయోజనం లేదని స్థానికులు, వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు అండర్‌పాస్ వంతెనను పరిశీలించి డిజైనింగ్‌ను మార్చాలని, సాధ్యం కానీ పక్షంలో ఫ్లైఓవర్ నిర్మించాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

అర్ధంతరంగా నిలిచిన పనులు..

డిజైన్ ప్రకారం పనులు ప్రారంభించిన సదరు కాంట్రాక్టర్ చివరిదశలో వదిలేశాడు. ఇప్పటివరకు చేపట్టిన పనులతో ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల నివారణకు ఎలాంటి ఉపయోగం లేదు. దీనికి తోడు కాంట్రాక్టర్ రోడ్డుపై అసంపూర్తి పనులు చేపట్టడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎన్‌హెచ్ఏఐ అధికారులు పట్టించుకోవడం లేదు. వీరి తీరును నిరసిస్తూ స్థానిక నాయకులు ధర్నాలు, ఆందోళనలు చేసినప్పటికీ వారిలో ఎలాంటి మార్పు రాలేదు. రెండు నెలల క్రితం తిరిగి పనులు ప్రారంభమైనప్పటికీ నత్తనడకన అవి సాగుతున్నాయి.

> **ఉన్నతాధికారులతో చర్చిస్తాం..**
>
> ఈ విషయంపై ఉన్నతాధికారులతో చర్చించి ప్రస్తుత డిజైన్‌పై మాట్లాడుతాను. ఈ డిజైన్‌పై స్థానికంగా వచ్చే సమస్యలు, ఇతర విషయాలను వారికి వివరించి డిజైన్ మార్చే విధంగా కృషి చేస్తాను. వైజంక్షన్ కూడలీలో అండర్‌పాస్ కంటే ఫ్లైవర్ నిర్మిస్తేనే అన్ని సమస్యలు పరిష్కారమయ్యేవి. త్వరలో సమస్యను పరిష్కరిస్తాం.
>
> – అంజయ్యయాదవ్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న



పోషణ మాసోత్సవాల్లో మాట్లాడుతున్న జ్యోత్స్న

కొందుర్గు: ప్రతీనిత్యం పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న అన్నారు. శనివారం మండలంలోని ఉత్తరాసిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, గ్రామాల్లో విరివిగా లభించే పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు తినాలని సూచించారు. అదేవిధంగా పాలు, ఉడికించిన గుడ్లు, అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శారద, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు చేరుతున్నాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సబ్బండవర్గాల అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మరోసారి మళ్లీ అధికారం ఇవ్వాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. ప్రతి పక్షపార్టీలను నమ్మితే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అజీంఅలీ, వివిధ గ్రామాల సర్పంచులు తలసాని వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీశైలం, జగన్ నాయక్, నాయకులు వర్కాల లక్ష్మినారాయణగౌడ్, అంజిరెడ్డి, శ్రీనివాస్, అబ్బిసుందరయ్య, లక్ష్మినారాయణ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించండి

పీఆర్టీయూటీఎస్ మండల శాఖ అధ్యక్షుడు బందయ్య

మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయ బదిలీలలో నా న్ స్పౌజ్ ఉపాధ్యాయులే అన్యాయానికి గురవుతున్నారని బదిలీలు, ప్రమోషన్లు పారదర్శకంగా నిర్వహించాలని పీఆర్టీయూటీఎస్ మండల శాఖ అధ్యక్షుడు జక్కని బందయ్య పేర్కొన్నారు. శనివారం ఆ యన మాట్లాడుతూ 317లో గత సంవత్సరం భార్యాభర్తలను రంగారెడ్డి జిల్లాకు అలాట్ చేసి కౌన్సిలింగ్ నిర్వహించకుండానే ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఈ క్రమంలో భార్యా లేదా భర్త పని చే స్తున్న దగ్గర పాఠశాలకు పంపించారన్నారు. మళ్లీ ఇ ప్పుడు స్పౌజ్ పేరుతో వారికి పది పాయింట్లు కేటాయించడంతో నాన్‌స్పౌజ్ ఉపాధ్యాయులకు అన్యా యం జరుగుతుందన్నారు. ఈ బదిలీలు, ప్రమోషన్లు పారదర్శకంగా జరగాలంటే సీనియార్టి లిస్టులో అవకతవకలు జరగకుండా చూడాలని ఆయన కోరారు.

ఆర్థిక సహాయం అందజేత



సాయం అందిస్తున్న సురేందర్‌రెడ్డి

శంకర్‌పల్లి: షాట్ సర్క్యూట్ వల్ల కొండకల్ గ్రామానికి చెందిన పులిమామిడి పద్మ ఇల్లు కాలిపోడంతో విషయం తెలుసుకున్న ఎంపీటీసీ బద్దం సురేందర్‌రెడ్డి రూ. 10వేలు, బీఆర్ఎస్ అధ్యక్షుడు లక్ష్మణ్ రూ. 2వేలు శనివారం అందజేశారు. అనంతరం ఆమెకు ప్రభుత్వం తరుపున గృహలక్ష్మి పథకం మంజూరుచేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రవి నాయక్, కైలాశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నేతలు



పార్టీలో చేరిన నాయకులు

శంషాబాద్: పట్టణంలోని ఊట్‌పల్లి, ఇందిరానగర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, పట్టణ అధ్యక్షుడు దేవేందర్, కౌన్సిలర్ కొండ ప్రవీణ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయాలని ఈ సందర్భంగా ఈటల వారికి సూచించారు.

సాగు, తాగు నీరేది?

- పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టులో అవినీతి
- నిర్మాణ పనులు పూర్తయినట్టు చెప్పడం బాధాకరం
- పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్



ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్న నేతలను అడ్డుకున్న పోలీసులు

షాద్‌నగర్: పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసి సాగు, తాగు నీరు అందిస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈ ప్రాజెక్టులో బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా అవినీతికి పాల్పడిందని పేర్కొన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని సందర్శించేందుకు శనివారం కాంగ్రెస్ నేతలు షాద్‌నగర్ నుంచి తరలివెళ్లారు. వారిని మార్గ మధ్యలో పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తి చేశామని, పొలాలకు నీళ్లు వదులుతున్నామని సీఎం కేసీఆర్ అబద్ధాలు చెప్పడం బాధాకరమన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చాలా ప్రాంతాల్లో చేపట్టాల్సిన కాల్వల నిర్మాణానికి ఇంకా ప్రభుత్వం భూసేకరణే చేపట్టలేదని, అలాంటప్పుడు ప్రాజెక్టు నిర్మాణ పనులు ఎలా పూర్తయ్యాయని ఆయన సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. ప్రజలను మభ్య పెట్టేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఆంధ్ర ప్రాంత కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవినీతి చోటు చేసుకుందని ఆయన తెలిపారు. పాలమూరు ప్రాజెక్టు ఎక్కడ పూర్తి చేశారో చూపించాలన్నారు. ప్రజలను మభ్యపెట్టి రానున్న ఎన్నికల్లో లాభపడాలని సీఎం కేసీఆర్ ఎత్తుగడలు వేస్తున్నారన్నారు. మాయమాటలు చెప్పే బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

సదస్సుకు కాంగ్రెస్ నేతలు

కడ్తాల్: హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కల్యాణ మండపంలో శనివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ మండల, బ్లాక్ కాంగ్రెస్ నాయకులతో సదస్సు నిర్వహించారు. సమావేశానికి కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కల్వకుర్తి బ్లాక్ అధ్యక్షుడు నర్సింహ, విజయ్‌కుమార్‌రెడ్డితో పాటు కడ్తాల్, తలకొండపల్లి మండలాల అధ్యక్షులు బీచ్యానాయక్ , ప్రభాకర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సదస్సుకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డితో పలువురు కాంగ్రెస్ నాయకులు హాజరైనట్లు వారు తెలిపారు.

కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- ఇళ్లమధ్య ఏర్పాటుతో జనం బెంబేలు
- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని విద్యుత్ అధికారులు



ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మొయినాబాద్: గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. మొయినాబాద్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలేకుండా ఉండటంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోకి పశువులు వెళితే మృత్యువాతకు గురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సురంగల్, నాగిరెడ్డిగూడ, ఎత్‌బార్‌పల్లి, చిలుకూరు, పెద్దమంగళారం, మేడిపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏర్పాటు చేసిన ఎర్త్ తీగలకు తగిలి గేదెలు, ఆవులు, మేకలు మృతి చెందాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు సైతం ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇనుప స్తంభాలను తొలగిస్తామని విద్యుత్ అధికారులు అనేక సార్లు చెబుతున్నా వాటిని మాత్రం తొలగించడంలేదు. గ్రామాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయడంలేదు. గ్రామాల్లో ఇళ్ల మధ్య, వ్యవసాయ పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ప్రమాదాలకు నెలవుగా మారాయని రైతులు, స్థానికులు చెబుతున్నారు. తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఇనుపకంచె ఏర్పాటు చేయాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

అనాథ వృద్ధులకు అండగా నిలుస్తాం

బీఆర్ఎస్ నేత మోహిజ్‌పాష



అన్నదానం చేస్తున్న మోహిజ్‌పాష

ఇబ్రహీంపట్నం: అనాథ వృద్ధుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని బీఆర్ఎస్ జిల్లా నేత ఎండీ మోహిజ్‌పాష అన్నారు. వినోబానగర్‌లోని మాతాపితరుల సేవా సదనంలో శనివారం అన్నదానం చేశారు. అనాథలతో కలిసి కేక్ కట్‌చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతాపితరుల సేవా సదనంలోని వృద్ధులకు అండగా ఉంటామన్నారు. మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ సెహనాత్‌బేగం, గరిగే శేఖర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాలు



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో భక్తులు

చేవెళ్ల: శ్రావణమాసం చివరి శనివారం కావటంతో శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు భక్తి శ్రద్ధలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులతో సందడిగా మారింది. శ్రావణమాసం ముగుస్తుండటంతో భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావటంతో అందరికీ ఒకేసారిగా సామూహికంగా వ్రతాలను పూజారి శ్రీపాదు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి రథసేవను ఊరేగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. ఈ సందర్భంగా పూజారి శ్రీపాదు మాట్లాడుతూ శ్రావణమాసం ముగింపు సమయంలో ఆలయంలో ప్రతి ఏడాది ప్రత్యేక పూజలు వ్రతాలు నిర్వహిస్తామని చెప్పారు. 11వ తేదీన శ్రావణ మాసం చివరి సోమవారం ఆలయంలో ప్రతేడాదిలాగే గంపజాతర ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

సంస్కృతిని కాపాడుకుందాం

శ్రీవాణి సాంస్కృతిక మండలి ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణ



లక్ష్మినారాయణను సన్మానిస్తున్న నూతన కమిటీ సభ్యులు

షాద్‌నగర్: దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని శ్రీవాణి సాంస్కృతిక మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పూర్వం గ్రామాల్లో భజనలు, కోలాటం, చెక్కభజన, జడ కొప్పులు వంటి జరిగేవని గుర్తుచేశారు. ప్రస్తుతం కళలు, సంస్కృతికి సంబంధించిన కార్యక్రమాలు పల్లెల్లో కనుమరుగవుతున్నాయన్నారు. వాటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతీ గ్రామంలో హరినామ సంకీర్తన భజన నిర్వహించేలా మండలి సభ్యులు కృషి చేయాలన్నారు. ప్రస్తుత యాంత్రిక యుగంలో చాలా మంది టీవీలు, సెల్‌ఫోన్‌లు, సామాజిక మాధ్యమాల ప్రభావంతో ఆధ్యాత్మిక ధోరణి తగ్గిందన్నారు. పాశ్చాత్య దోరణిని విడనాడి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా కొందుర్గు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనున్నకున్నారు. అధ్యక్షుడిగా శివ శంకర్, గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా నర్సింలు, నిర్మల్ చౌదరి, సహాయ కార్యదర్శులుగా మంగలి శివ శంకర్, భీమయ్య, ప్రవీణ్, కోశాధికారిగా రాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి నారాయణ, శ్రీనివాస్, గౌరిశంకర్, గణేశ్, నర్సింలు, రాజు, శివ శంకర్, సత్యనారాయణ, పవన్, రాజు, మహేందర్, నందు, నరేశ్, భీమయ్య, రాజు, బుగ్గయ్య, ప్రవీణ్‌కుమార్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాణి మండల కమిటీ..

కొందుర్గు: ప్రతి గ్రామంలో భారతీయ సంస్కృతి, కళలను వెలికితీయడం కోసం అన్ని గ్రామాల్లో శ్రీవాణి కమిటీలను వేస్తున్నామని శ్రీవాణి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణ అన్నారు. శనివారం కొందుర్గు మండల కమిటీని ఎన్నుకున్నారని ఆయన చెప్పారు. గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాసు, అధ్యక్షుడిగా శివశంకర్, ఉపాధ్యక్షులుగా నర్సింలు, నిర్మల్ చౌదరి తదితరులను ఎన్నుకుటన్నట్లు ఆయన పేర్కొన్నారు.

సిద్దులగుట్టలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్: మూడురోజుల పాటు జరిగే సిద్దుల గుట్ట దేవాలయం జాతర ప్రారంభోత్సవంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు, పాలాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ దూడల వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు మేకల వెంకటేష్ ముదిరాజ్, వై. కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి నేతలు మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం లేదు

ఆమనగల్లు: బీఆర్ఎస్ విజయాన్ని ఏ శక్తి అడ్డుకోలేదని ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని తెలిపారు. బీజేపీ, వివిధ పార్టీల నుంచి సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు పత్యానాయక్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.